www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 మార్చి 2024
5



కోనసీమ

జపాన్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జపాన్ దేశంలో ఉద్యోగం చేయడానికి అవసరమైన శిక్షణ పొందేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ ఎన్ఆర్ ఆధ్వర్యంలో దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాష, ఎన్ 5, ఎన్ 4, ఎన్ 3 స్థాయిల్లో శిక్షణ ఇచ్చేందుకు 32 ఏళ్ల లోపు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షలు కాగా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు, దీనిలో రూ.25 వేలు రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ మిగిలిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాలన్నారు. శిక్షణ ఫీజు 3 లక్షలు మూడు విడతలుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే లక్షా 10 వేల నుండి లక్షా 40 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 95814 22339 నెంబర్‌లో సంప్రదించాలని లోక్‌మాన్ సూచించారు.

ప్రభావం చూపుతారా..!

- మళ్లీ ముద్రగడ రాజకీయ పునః ప్రవేశం
- త్వరలో వైసిపిలో చేరనున్న కాపు ఉద్యమ నేత



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ముద్రగడ అంటే ఒక సంచలనం. ఎన్ని పార్టీలు మారినా, ఎలా వ్యవహరించినా గోదావరి జిల్లాల్లో ఆయనకో ప్రత్యేక ఇమేజ్ ఉంది. గోదావరి జిల్లాలకే కాదు, ఎపిలోనే సీనియర్ నేతల్లో ఆయన ఒకరు. 1978 లోనే అసెంబ్లీ గడపతొక్కిన నేతల్లో చంద్రబాబునాయుడితో పాటు ముద్రగడ మాత్రమే కొనసాగుతున్నారు. గతంలో ఆయన రాజకీయంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావితం చేసే స్థాయిలో ఉండేవారు. 2009చ 20014 ఎన్నికల్ల వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తరువాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2015 నుంచి 2016 మధ్యలో జరిగిన కాపు ఉద్యమంతో మళ్లీ ఆయన పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. 2016 జనవరిలో ఆయన హయాంలో తునిలో జరిగిన కాపు ఐక్య గర్జన సభ, రైలు దగ్ధం ఘటనలతో వార్తల్లోకెక్కారు. ఆ తర్వాత కాపు ఉద్యమం ముందుకు సాగిన దాఖలాలు లేవు. దాంతో సుమారు పదేళ్లుగా ఆయన రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అనేక పరిణామాల అనంతరం ముద్రగడ వైసిపి కండువా వేసుకునేందుకు సన్నద్ధమయ్యారు.

ఈ తరుణంలో ఎన్నికల్లో ఆయన ప్రభావంపై సర్వత్రా చర్చజరుగుతుంది. రాజకీయంగా ఆయన గడచిన ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఏ పార్టీకి ఓటు వేయాలన్నది మాత్రం స్పష్టం చేయలేదు. ఈసారి మాత్రం నేరుగా వైసిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 14న తన కుమారుడు గిరితో కలిసి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకోబోతున్నారు.

జనసేన ద్వారా కాపు ఓట్లను దక్కించుకోవాలనే ఆలోచనలో టిడిపి ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిడిపి ఎత్తుగడకు చెక్ పెట్టడం కోసం ముద్రగడను వైసిపి రంగంలోకి దింపింది. ఆయనకు ఎక్కడా సీటును మాత్రం ఖరారు చేయలేదు. ఈ తరుణంలో జనసేన ఓట్లను వైసిపి వైపు ముద్రగడ ఏ మేరకు మళ్లించగలుగుతారనేది ప్రశ్న. ఒక్కకాపు సామాజికవర్గంలోనే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోనూ ఆయనకు అభిమానులు ఉన్నారు. వారి ఓట్లను ఆయన అధికార పార్టీవైపు ఎలా మళ్లిస్తారో చూడాలి. కోనసీమ ప్రాంతంలో ముద్రగడకు అనుచరులు ఎక్కువ. వారిలో చాలా మంది ఇప్పుడు జనసేనలో ఉన్నారు. వారిని ఆయన ఏ మేరకు ప్రభావితం చేస్తారనేది చూడాలి.

రైతులకు మద్దతుగా నేడు ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా మార్చి 14న ఢిల్లీ రామ్ లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరుతూ ఢిల్లీ బయలుదేరిన రైతాంగాన్ని హర్యానా సరిహద్దుల్లో అడ్డగించిందన్నారు. కందకాలు తవ్వడం, మేకులు నాటడం, బారికేడ్లు, ముళ్ళకంచెలు ఏర్పరచడం, వాటర్ క్యాన్లు ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడంతో పాటు డ్రోన్ల ద్వారా విష వాయువులు చిమ్మించింది. ఈ చర్యల వల్ల అనేక మంది రైతులు కంటి చూపు, వినికిడి కోల్పోయారని, కాల్పుల్లో శుభకరణ్ సింగ్ అనే యువరైతు మృతి చెందాడని, మరొక ముగ్గురు రైతులు గుండె ఆగి చనిపోయారు చెప్పారు. ఈ దాడిలో 200 ట్రాక్టర్లు ధ్వంసం అయ్యాయన్నారు. ఈ దురాగతానికి హర్యానా బిజెపి ప్రభుత్వం, పోలీసులు, కేంద్ర ప్రభుత్వ బలగాలు పంజాబ్ సరిహద్దుల లోపలకు చొరబడి పాల్పడ్డాయని చెప్పారు. రెండేళ్ల నుంచి రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు పరచకుండా రద్దు చేసిన నల్ల చట్టాల విధానాలనే దొడ్డిదారిలో అమలుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఢిల్లీలో రైతులకు మద్దతుగా జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-అమలాపురం



గుండెపూడిలో ఆర్‌బికెను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

అల్లవరం మండల పరిధిలో పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ బుధవారం నిర్వహించారు. ముందుగా కొమరగిరిపట్నం వైయస్సార్ హెల్త్ క్లినిక్-3లో నరేగా జిజిఎంపి నిధులు రూ.26 లక్షలతో నిర్మించిన భారత నిర్మాణ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో సిఎస్ఆర్ నిధులైన 31.50 లక్షలతో నిర్మించనున్న ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రామేశ్వరంలో మరో ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు సిఎస్ఆర్ నిధులైన రూ.31.50 లక్షలు భూమి పూజ నిర్వహించారు. మొగళ్లమూరులో వైయస్ఆర్ఎల్ క్లినిక్‌లో నరేగా నిధులు జీజీఎంపి నిధులైన రూ.26 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన భారత నిర్మాణ సేవ కేంద్రం ప్రారంభించారు. డి.రావులపాలెంలో ఆర్ఎంపి రోడ్డు నుండి బాబా నగర్ వరకు రూరల్ డెవలప్మెంట్ నిధులైన రూ.180 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. గుండెపూడి సామంతకుర్రులో నరేగా నిధులు రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. యెంట్రుకోన గ్రామపంచాయతీ పరిధిలో ఉల్లింగి వారి పేట - అరుంధతి కాలనీలో సిఎస్ఆర్ నిధులు రూ.31.50 లక్షలతో నిర్మించనున్న ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గూడాల గ్రామంలో నందు నరేగా నిధులైన రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కోడూరుపాడు మాకేవారిపేటలో సిఎస్ఆర్ నిధులైన రూ.31.50 లక్షలతో నిర్మించనున్న ఒహెచ్ఎ స్ఆర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, జెడ్‌పిటిసి కె.గౌతమి, ఎంపిపి ఇళ్ల శేషారావు, ఎఎంసి చైర్మన్ డోలామణిరుద్ర, మండల అధ్యక్షుడు కె.బాపూజీ, వైస్ ఎంపిపి వడ్డి గంగ, ఎంపిటిసి పి.రాజేశ్వరి స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ హడావిడి ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మండలంలో హడావుడిగా ప్రారంభోత్సవాల జాతర జరుగుతోంది. ఎక్కడ చూసినా ముహూర్తాలు లేవనే సాకుతో హడావిడిగా అసంపూర్తిగా ఉన్న భవనాలను ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని పనులు పూర్తికాని భవనాలను వైసిపి ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తున్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన బండారులంక సచివాలయం-1 నూతన భవనాన్ని మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం ప్రారంభించారు. పూర్తికాని భవనాన్ని ప్రారంభించడం ఏమిటని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. కింది అంతస్తు ఏదో తూతూ మంత్రంగా పనులు పూర్తయినప్పటికీ పై అంతస్తు మొత్తం మెటీరియల్‌తో నిండి ఉంది. ప్రారంభోత్సవానికి అడ్డుగా ఉందని ప్రవేశ ద్వారం వద్ద ఉన్న మెటీరియల్‌ను పైఅంతస్తులో వేయించారు. రెండు సంవత్సరాల నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్న సమనస గ్రామ సచివాలయయాన్ని ఇటీవల మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇప్పుడు పూర్తికాని సచివాలయ భవనాన్ని ప్రారంభించారు.



పూర్తికాని సచివాలయ పైఅంతస్తు



మెటీరియల్‌తో నిండిన సచివాలయ పైఅంతస్తు

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

సోషల్ మీడియాలో ట్రోలింగ్స్‌తో ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని మైనార్టీ బిసి సంఘం నాయకులు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చదువుకున్న యువత ఉపాధి అవకాశాలను అన్వేషించాలి తప్ప ఇలా సోషల్ మీడియాలో వ్యూస్ ద్వారా వచ్చే ఆదాయం మీద ఫోకస్ చేసి వారి ఆత్మాభిమానానికి భంగం కలిగేలా వ్యవహరించి ట్రోలింగ్స్ చేయడం దారుణమని విమర్శించారు. దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

పి.గన్నవరం సీటుపై ఉత్కంఠ

ప్రజాశక్తి -మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గంలో సీటుపై ఉత్కంఠ నెలకొంది. వైసిపి అభ్యర్థిగా జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌కు ఖరారు కావడంతో ఆయన ప్రచారం ప్రారంభించారు. అయినా చాప కింద నీరులా వైసిపిలో అసమ్మతి కొనసాగుతోంది. రెండేళ్లలో జెడ్‌పి చైర్మన్ హోదాలో ఆయన కేడర్‌ను కలిసిన దాఖలాలు లేవని వారిలో అసంతృప్తి నెలకొంది. టిడిపి అభ్యర్థిగా సరిపెల్ల రాజేశ్‌ను ప్రకటించగా సానికేతరుడు కావడమే కాక వివాదాస్పద వ్యక్తిగా ఈ ప్రాంత నాయకులు కొందరు వ్యతిరేకిస్తుండడంతో తో రాజేశ్ ఎన్నికల బరి నుంచి తప్పు కుంటున్నట్లు ప్రకటించారు. జనసేన, టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా పి.గన్నవరం బిజెపికి కేటాయించాలని ఆ పార్టీ పట్టు పడుతున్నట్టు తెలిసింది. గతంలో పరిపాలనా అనుభవం ఉన్న మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యాజీ వేమాకు టికెట్ కేటాయించే ఆలోచనలో బిజెపి పెద్దలు ఉన్నట్టు సమాచారం. జిల్లాలో రిజర్వుడ్ 3 స్థానాల్లో 2 స్థానాలు మిత్ర పక్షలకే కేటాయిస్తే అమలాపురం అయినా టిడిపికే కేటాయించాలని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు కోరుతున్నారు. ఏదేమైనా చివరి నిమిషం వరకూ టికెట్ కేటాయింపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో ఓటు హక్కు విలువలు తెలుపుతూ ప్రచురించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటుకు ఎంతో విలువ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమన్నారు. నీ ఓటు, నీ భవిష్యత్తు అని నినదిస్తూ ఓటును అమ్ము కోవద్దు, నిస్వార్థంగా సేవలందించే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని చెప్పారు. ఓటు అమ్ముకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు, సాంఘిక సంక్షేమ బిసి సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 9 మంది విద్యార్థుల గైర్హాజరు

ప్రజాశక్తి-మండపేట

రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు 129 మంది హాజరు కావలసి ఉండగా 120 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డివివిఎన్.ఆర్ రెడ్డి తెలిపారు.



మండపేటలో పౌష్టికాహార పక్షోత్సవం

పౌష్టికాహారంతోనే గర్భిణుల ఆరోగ్యం

ప్రజాశక్తి-మండపేట

గర్భిణుల రక్తహీనతను నియంత్రించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని అంగన్‌వాడీ సూపర్వైజర్ సింహాచలం అన్నారు. బుధవారం మండపేట పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు గర్భిణులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి-అమలాపురం

దేశ సంస్కృతిలో రామాయణ భారత ఇతిహాసాల్లో సదాచారం, నీతి నియమాలు, ధర్మ నిరతి, భక్తి జ్ఞాన వైరాగ్యాలు అన్నిచోట్ల కనిపిస్తాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆతుకూరి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో రచయితలు కార్యసాధనలో వ్యక్తిగత సుఖాలను పరిత్యజించి, సత్య ధర్మ న్యాయ సదాచారాలకు ప్రాధాన్యమివ్వటం ముఖ్యమనే విషయాన్ని మొల్ల ప్రబోధిస్తుందన్నారు. విశ్వకళ్యాణ భావన, సత్యపాలన, సన్మార్గ గమనం, దానగుణం, ఆత్మవిశ్వాసం, సక్రమ ధనార్జన, క్రోధనాశనం, సోదరప్రేమ, శాంతి మొదలగు మానవతా విలువలకు ఆమె రచనలు నిలుస్తోందన్నారు సామాజిక వికాసానికి, సంస్కృతి పరిరక్షణకు మంచి మానవ సంబంధాలను 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అయిన ఆతుకూరి మొల్ల తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణాన్ని రాసిందన్నారు. మొల్ల శ్రీకృష్ణదేవరాయలు సమయంలోనిదని మొల్ల రచన శైలి చాలా సరళమైందని, రమణీయమైందన్నారు. డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొల్ల ఏ విధమయిన సంప్రదాయ విద్యను అభ్యసించలేదని, ఆమెది సహజ పాండిత్యం అన్నారు.

బలహీనవర్గాల పారిశ్రామికవేత్తలకు సాయం

ప్రజాశక్తి-అమలాపురం



కార్మికులకు చెక్కును అందజేస్తున్న డిఆర్ఒ

దేశంలోని 500 మండలాలకు సంబంధించి బలహీన వర్గాలకు చెందిన ఒక లక్ష మంది పారిశ్రామికవేత్తలకు క్రెడిట్ సపోర్టు మంజూరు చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. బుధవారం ప్రధాన మంత్రి ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెనుకబడిన వర్గాలకు రుణ సహాయం కోసం దేశవ్యాప్తంగా విస్తృతంగా చేరువయ్యే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రం అణగారిన వర్గాలకు ప్రాధాన్యత మోడీ గ్యారెంటీ సామాజిక అభ్యున్నతి, ఉపాధి ఆధారిత ప్రజా సంక్షేమం కార్యక్రమాన్ని ప్రారంభిం చిందన్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికార మంత్రిత్వపు శాఖ ఆధ్వర్యంలో అణగారిన ఎస్‌సి, ఒబిసి పారిశుధ్య కార్మిక వర్గాలకు చెందిన లక్ష మందికి రుణాలు కల్పించే దిశగా కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి రూపొందించారన్నారు. ప్రధాన మంత్రి సమాజిక్ రోజ్‌గార్ అధారిత్ జనకళ్యాణ్ ప్రధానమంత్రి సూరజ్ జాతీయ పోర్టల్‌ను ప్రధాన మంత్రి ప్రారంభించారన్నారు. దేశంలోని బలహీన వర్గాలకు చెందిన ఒక లక్ష మంది పారిశ్రామిక వేత్తలకు క్రెడిట్ సపోర్టు మంజూరు చేస్తారన్నారు. అదనంగా, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు పారిశుధ్య కార్మికులతో సహ వెనుకబడిన వర్గాల నుండి వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ప్రధాన మంత్రి సంభాషించారు. వెనుకబడిన వర్గాలకు క్రెడిట్ మద్దతు కోసం జాతీయ పోర్టల్ బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రధాన మంత్రి నిబద్ధత ఈ కార్యక్రమం ద్వారా ప్రతిబింబించిందన్నారు. ఇది సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాలను ఉద్ధరించడానికి ఉద్దేశించిన ఒక పరివర్తనాత్మక చొరవని బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సి, ఎంఎఫ్ఐలు ఇతర సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అర్హులైన వ్యక్తులకు క్రెడిట్ సపోర్ట్ అందిస్తామన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) కింద సఫాయి మిత్రలకు (మురుగు సెప్టిక్ ట్యాంక్ కార్మికులు) ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పిపిఇ కిట్లను కూడా ప్రధాన మంత్రి పంపిణీ చేశారన్నారు. ఈ చొరవ సవాల్‌తో కూడిన పరిస్థితులలో పని చేసే ఫ్రంట్‌లైన్ కార్మికుల ఆరోగ్యం భద్రతను కాపాడే దిశగా మరో అడుగును సూచిస్తుందన్నారు. వెనుకబడిన వర్గాలకు రుణసహాయం కోసం దేశవ్యాప్తంగా విస్తత ప్రచారం కల్పించే కార్యక్రమంలో వెనుకబడిన వర్గాల లక్ష మంది పారిశ్రామికవేత్తలకు క్రెడిట్ రుణాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 43 మంది శ్రీనిధి మహిళ సభ్యులకు రూ.32 లక్షల 35 వేలు, నేదునూరు ఇండియన్ బ్యాంకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఐదుగురికి రూ.5 లక్షల విలువైన చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, ఎల్‌డిఎం కె.శ్యాంబాబు, పురపాలక సంఘ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జ్యోతిలక్ష్మి దేవి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

జీతాలు, అలవెన్సులు చెల్లించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం



వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమ్మె కాలానికి సంబందించి పెండింగ్ జీతాలతో పాటు ఇతర అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం కోరింది. బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్.వెంకన్న బాబు ఆధ్వర్యాన సమగ్ర శిక్ష కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె కాలానికి జీతాలు విడుదల చేయాలని, ప్రతి నెలా జీతాలు మొదటి తేదీకే ఇవ్వాలని, సిఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు ఇవ్వాలని, సాధారణ సెలవులతో పాటు మహిళా ఉద్యోగులకు అదనపు సాధారణ సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎజమధుసూదన రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాన్ బాబు రత్నం, అనూష, రమాదేవి సుబ్రమణ్యం పాల్గొన్నారు.



అంబాజీపేట సెంటర్‌లో పోలీసు కవాతు

గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - అంబాజీపేట, ఆత్రేయపురం

మండల పరిధిలో పి.గన్నవరం సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యాన మాచవరం, అంబాజీపేట, తొండవరం, వాకలగరువు, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గ్రామాల ప్రధాన రోడ్లలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ పోర్స్(సిఐఎస్ఎఫ్), స్థానిక పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ప్రశాంత్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు, ఎన్నికల సమయం ఆసన్నమైనందున శాంతియుత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆత్రేయపురం ఎన్నికలను పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా ప్రజలకు రక్షణ కల్పిస్తామని రావులపాలెం రూరల్ సిఐ ఎం.రామ్‌కుమార్, ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పోలీసులు, సిఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులు వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం గ్రామాల ప్రజలకు భరోసా కల్పించేలా అవగాహన కల్పించారు.

కార్టూన్ 'నిజం'



అలా అనకండి సార్..!!
మనకెవ్వరూ ఓటెయ్యరు..!!

వసతి గృహాల్లో సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-అమలాపురం



వసతి గృహాలకు సామాగ్రిని అందజేస్తున్న కలెక్టర్, ఓఎన్‌జిసి అధికారులు

జిల్లాలోని 55 బిసి, ఎస్‌సి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ఓఎన్‌జిసి, రిలయన్స్, గెయిల్ చమురు నిక్షేపాలు వెలికి తీసే సంస్థలు ముందుకు వచ్చాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం ఓఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులతో 37 వసతి గృహాలకు రూ.16.80 లక్షలతో సమకూర్చిన కుక్కర్లు, గ్రైండర్లు, మిక్సీలు ఇడ్లీ స్టీమర్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులక వసతుల కల్పనకు సిఎస్ఆర్ కింద చమురు సంస్థలు నిధులు సమకూరుస్తున్నాయని చెప్పారు. విద్యార్థుల అభిమానులకు అనుగుణంగా త్వరలో ఓఎన్‌జిసి ద్వారా ఫ్రిజ్, వాటర్ కూలర్లు సమకూరుస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే రిలయన్స్ సంస్థ పరుపులు, ఇన్వెర్టర్లు సమకూర్చారని తెలిపారు. గెయిల్ సంస్థ త్వరలో 55 వసతి గృహాలకు ఆర్ఒ ప్లాంట్లను అమర్చనున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న దాతల ద్వారా టివిలు, స్పోర్ట్స్ కిట్స్ సమకూర్చనున్నట్లు ఆయన వెల్లడించారు. ఓఎన్‌జిసి చీఫ్ జనరల్ మేనేజర్ రవిశంకర్ మాట్లాడుతూ సిఎస్ఆర్ కింద సమకూర్చే వివిధ వస్తు సామాగ్రి భవిష్యత్ తరాలకు కూడా అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, సిపిఒ వెంకటేశ్వర్లు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సాంబమూర్తి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, ఒఎన్జిసి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్యామనాథ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

కామనగరువు పంచాయతీలో రూ.60 లక్షలతో వివిధ అభివద్ధి పనులకు బుధవారం సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ అధ్యక్షతన శంకుస్థాపనలు చేశారు. తొలుత రూ.10 లక్షలతో అబ్బిరెడ్డి కాలనీలో రెండు రోడ్లు, రూ.10 లక్షలతో కరక్కాయ పేటలో రెండు రోడ్లు, బాలయోగి కాలనీలో రూ.20 లక్షలతో మూడు రోడ్లు, మరో రూ.20 లక్షలతో డ్రైన్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ పనులు పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ ఎన్ఆర్‌జిఎస్ నిధుల నుండి ఖర్చు చేస్తామన్నారు. ఉపసర్పంచ్ రాజలపూడి భాస్కరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

130 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 130 కింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేశామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. పిడిఎస్ అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ డిటి తాటిపూడి దివాకర్, పోలీస్ సిబ్బందితో కలిసి గోపాలపురం శివారు పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యాన్‌లో 130 క్వింటాల పిడిఎస్ రైస్ పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2.08 లక్షలు ఉంటుందని తెలిపారు. పిఠాపురానికి చెందిన అల్లుమల్లు రామును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్


ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో సారాను విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బిఎన్.దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. చైతన్యనగర్‌లో నాటుసారా అమ్ముతున్న పుల్లూరి సితారత్నంను అరెస్టు చేశామని సిఐ తెలిపారు. ఆమె నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పని ప్రదేశాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎపిఒ, వెటర్నరీ అధికారులతో సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హార్టికల్చర్ క్రింద ప్రతి గ్రామంలోనూ తోటల పెంపకం, రైతులను గుర్తించాలని, గొర్రెలు, పశువులకు షెడ్లు నిర్మించుకునే రైతులను గుర్తించాలని, వీటన్నింటికీ ఉపాధి హామీ పథకం ద్వారా పేమెంట్లు చేస్తారని తెలిపారు. హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజులకు మస్తర్లు హాజరు నమోదు చేసి మార్చి నెలాఖరుకు వేతనాలు అందచేయాలన్నారు. 2023 -2024 ఆర్థిక సంవత్సరానికి సబంధించి నిర్దేశించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు కల్పించడానికి అవసరమైన పని దినాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆటో డ్రైవర్‌కు తోటి ఆటో డ్రైవర్లు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పెదగాడవిల్లికి చెందిన గాలి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉంటుండగా ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంచే రవి, ఆటో డ్రైవర్లు గోడి నాని, గెద్దాడ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక 15వ వార్డుకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్, ఇటీవలె మరణించిన దుగ్గిరాల లక్ష్మి కుటుంబాలను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, సిరంగి ఈశ్వరరావు ఉన్నారు.



రోడ్డుపై సెప్టిక్ ట్యాంక్ నీటిలో చిన్నారులు

రోడ్డుపైకి సెప్టిక్ ట్యాంక్ నీరు

ప్రజాశక్తి - అంబాజీపేట

నిత్యం రద్దీగా ఉండే మాచవరం పోతురాజు గుడివద్ద ఒక ఆసామి ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లోని నీటిని ప్రతి రోజూ రోడ్డు పైకి వదులుతున్న దుస్థితి నెలకొన్నా అటు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమీపంలోని నిత్యం మసీదుకు వెళ్లే ముస్లిములు, నాగమల్లి చెట్టు సమీపంలో ప్రభుత్వ పాఠశాలకు నడిచి వెళ్ళే స్కూల్ చిన్నారులు రహదారిలో సెప్టిక్ ట్యాంక్ నీటిలోనే నడిచి వెళుతున్నారు. వారికి ఏదైనా అంటువ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురైతే దానికి ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుచున్నారు.

ఇంటర్ పరీక్షకు 50 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 50 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.జయ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలైన డాక్టర్ ఎంజిఆర్ కళాశాలలో 301 మందికి 279 మంది హాజరు కాగా 22 మంది, తార కళాశాలలో 206 మందికి 192 మంది హాజరు కాగా 14 మంది, గురుకుల పాఠశాలలో 247 మందికి గాను 233 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 50 మంది గైర్హజరయ్యారని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని కోరుతూ యానాం డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఆవశ్యకతను ప్రతీ ఓటరు తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ చిన్నా సెంటర్, పిల్లారాయవీధి, జిమ్మర్ సెంటర్ తదితర ప్రధాన వీధుల్లో సాగింది. అలాగే మధ్యాహ్నం ఇవిఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ సి.నరేష్, ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పార్కును శుభ్రపరుస్తున్న వాలంటీర్లు

మున్సిపల్ పార్కులో పరిశుభ్రత

ప్రజాశక్తి - యానాం

యానాం అంబేద్కర్ నగర్‌లోని మున్సిపల్ పార్కును స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ పి.వేలాయుధం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పిఒ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను, తుప్పలను తొలగించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని వాలంటీర్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేసిన సభ్యులు

పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -మామిడికుదురు

ఎపి ఎస్‌సి కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మామిడికుదురులోని బాలురు, బాలికల వసతి గృహాల్లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను విద్యాశాఖధికారులు ఎస్‌వివిఎస్.లక్ష్మీ నారాయణ, ఎంఇఒ-2 మోకా వెంకన్నబాబు అందజేశారు ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం చిట్టినీడి నిరంజని, బాయ్స్ హాస్టల్ వార్డెన్ ప్రవీణ్ కుమార్, గర్ల్స్ హాస్టల్ వార్డెన్, సంఘం అధ్యక్షులు భూపతి మనోహర్ రాజు , ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్ బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు దొంగ సత్యనారాయణ, సంఘ గౌరవాధ్యక్షుడు పెయ్యల వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్ బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బయా మోహనరావు, సభ్యులు తరపట్ల గణపతి, కొనుకు శ్రీనివాసరావు, చొప్పల గోపి, చొప్పల రమేష్ బాబు, కారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ శేఖర్ బాబు కోరారు. అలా కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం అమలాపురం మండలం కామనగరువు గ్రామపంచాయతీలో జరిగిన అవగాహన సదస్సుకు గ్రామ సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖర్ బాబు ప్రసంగించారు. ఎన్నికల నియమావళిపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, చొల్లంగి శ్రీను, మెండు ప్రసాద్, పమ్మి తాతాజీ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి అచ్యుత జానకి, సర్పంచ్ శ్రీదుర్గ

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండలంలోని గ్రామాలన్నింటినీ దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపిపి దంగేటి బేబీ అచ్యుత జానకి అన్నారు. గొల్లవిల్లి పంచాయతీ ఇందిరానగర్ దళితపేటలో బుధవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎంపిపి అచ్యుత జానకి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మాజీ ఉపసర్పంచ్ మారిశెట్టి రాంబాబు, వార్డు సభ్యులు జినిపె మహాలక్ష్మి, నక్కా పద్మశ్రీ, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, ఇఒపిఆర్ డికెఎస్.గౌరీ కుమారి, వైసిపి నాయకులు గొలకోటి దొరబాబు, మారిశెట్టి నరేష్, జొన్నాడ చిన్ని పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్లు దాఖలు, పోలింగ్ ప్రక్రియ వంటి అంశాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్లు దాఖలు అనుమతుల మంజూరు సి.విజిల్ యాప్ వినియోగం, హెల్ప్ డెస్క్ క్యూలైన్లు, పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లను దాఖలు చేసే విధానాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించారు. ఈ దఫా ఎన్నికల్లో కొత్తగా ఇంటి వద్ద నుండి ఓటింగ్ వేసే అవకాశం 40 శాతం పైబడి వికలాంగత్వం ఉండి సదరం సర్టిఫికెట్లు పొందిన వికలాంగులు, 85 ఏళ్ల వయసు పైబడిన వారు సద్వినియోగం చేసుకునే వెసులుబాటును ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. పార్లమెంటు స్థానం కోసం పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ స్థానంలో పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.40 లక్షలు వరకు ఖర్చు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీనికోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల తరువాత నిర్ణీత గడువులోగా ఖర్చుల వివరాలను తెలియజేస్తామన్నారు. పోలింగ్ రోజున చేసే ఏర్పాట్లు, అధికార బృందాల నియామకం, వాహనాలు సమకూర్చడం, ఇవిఎంలు, మాక్ పోల్, సువిధ, పాలింగ్ రోజు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, హెరీమ్ ఓటింగ్, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి ముందే మాక్ పాలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి.ప్యాట్లను కలిపి ఒక ఇవిఎం యూనిట్‌గా పరిగణనిస్తారని, వీటిలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్కటి పని చేయకపోయినా మొత్తం యూనిట్లను మారుస్తారని తెలిపారు. ఒక్క వివి ప్యాట్లో ఏమైనా సమస్య తలెత్తితే మాత్రం, ఆ ఒక్క దానినే మారిస్తే సరిపోతుందని తెలిపారు. ఇవిఎంలతో పాటు టెండర్ ఓట్లను కూడా ప్రతీ పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా అంది స్తారన్నారు. అభ్యర్థుల చేసే ఖర్చుపై వ్యయ పరిశీలకుల నిఘా ఉంటుందని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తారని తెలిపారు. ఫిర్యా దుల కోసం 24 గంటలూ పనిచేసే ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు తమ ఆస్తులు, తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను చేసే విధానం, నిబంధనలు, జత పరచాల్సిన తదితర అంశాలను వివరించారు. ఎన్నికలు. ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటుకు అసెంబ్లీకి పోటీ చేసేవారు ఎన్నికల కమిషన్ నిర్దేశించి నిర్దేశించిన పారాలతో పాటుగా పూర్తి వివరాలతో అపిడవిట్లను సమర్పించాలన్నారు. మొత్తం నామినేషన్ పత్రం ఆరు విభాగాలుగా ఉంటుందన్నారు.. పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.25 వేలను, అసెంబ్లీకి పోలింగ్ పోటీ చేసే అభ్యర్థి రూ.10 వేలను ధరావతు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని, కుల ధవీకరణ పత్రం. జత చేయాలని సూచించారు. గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు నామినేషన్ల దాఖలు తుది గడువు లోగా బి-ఫారాలను అందజే యాల్సి ఉంటుందని. లేదంటే సదరు అభ్యర్థులను స్వతంత్రులుగానే పరిగణిస్తామన్నారు. అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రాష్ట్రంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలని, సంబంధిత ఓటరు జాబితా కాపీని ధ్రువపరిచి జతచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఆస్తులు, తమ కుటుంబ సభ్యుల ఆస్తులను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఒక అభ్యర్థి ఒక ఎన్నికల్లో గరిష్టంగా రెండు చోట్ల మాత్రమే పోటీ చేసే అవకాశం ఉందన్నారు. బ్యాలట్ పత్రాలపై ముద్రించడం కోసం, అభ్యర్థులు ఎటువంటి రాజకీయ గుర్తులు లేని తమ ఫోటోను జత చేయాల్సి ఉంద న్నాడు. బ్యాంకు ఖాతా వివరాలను తప్పనిసరిగా సమర్పించాలన్నారు జిల్లావ్యాప్తంగా ఉన్న 1,644 పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్ మీద ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటి నుండి ఓటింగ్ కోసం సంబంధిత ఓటర్లు దరఖాస్తు చేయాల్సి ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్, టి.వైద్యనాథ్ శర్మ, దూరి రాజేష్ (బిజెపి) కామన ప్రభాకర్ రావు (కాంగ్రెస్ పార్టీ), సంసాని నాని (వైసిపి), పి.పవన్ సూర్య (ఆమ్ ఆద్మీ పార్టీ)కాశీ లక్ష్మీ భవాని (బహుజన సమాజ్ పార్టీ), ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, టేకి గ్రామాల్లో బుధవారం మండపేట రూరల్ సిఐ శ్రీధర్, అంగర ఎస్ఐ అందే పరదేశి ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లోని మెయిన్ రోడ్డుల్లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), స్థానిక పోలీసులతో కలిసి కవాతు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదల సంక్షేమానికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రంలోని పేద ప్రజల పక్షాన సిఎం జగన్ నిలబడి వారి సంక్షేమానికి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని స్థానిక సర్పంచ్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉప సర్పంచ్ మోకా శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామంలోని 292 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లపట్టాలను అందజేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పాటుపడుతున్న జగన్‌ను ఆశీర్వదించి మరో మారు సిఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు దోనిపాటి వెంకట రామకృష్ణ, గోడి దుర్గారావు, దాసి త్రిమూర్తులు, తొత్తరమూడి వీర దుర్గారావు, వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు, చెట్ల విద్యాసాగర్, తోలేటి రామ్ కుమార్, విఆర్ఒ గనిశెట్టి వీరవేణి పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ముమ్మిడివరంలో ఆరోగ్య సురక్ష

ముమ్మిడివరం : రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -మామిడికుదురు

గెయిల్ పర్యవేక్షణలో కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా సిరపడాలని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు సూచించారు. మామిడికుదురు బోయి బీమన్న మానవ వనరుల కేంద్రంలో గెయిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొందిన 54 మంది మహిళలకు గెయిల్ సమకూర్చిన 54 కుట్టు మిషన్లను, సర్టిఫికెట్‌లను ఆయన అందచేశారు. పాశర్లపూడిలో కుట్టు శిక్షణ కేంద్రానికి కూడా గెయిల్ సహాయ సహకారాలు అందించాలని ఎంఎల్ఎ కోరారు. ఈ కార్యక్రమంలో తాటిపాక గెయిల్ టెర్మినల్ హెడ్ కె.రాంబాబు, గెయిల్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ మేనేజర్ సురేష్, శిక్షకురాలు కె.రమణి పాల్గొన్నారు.



గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎంపిపి భవాని

ఉట్రుమిల్లిలో ఎంపిపి పర్యటన

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతి ఒక్కరూ మళ్లీ వైసిపికి ఓటు వేయాలని ఎంపిపి అంబటి భవాని పిలుపునిచ్చారు. ఆమె బుధవారం మండలంలోని ఉట్రుమిల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అయ్యల అమ్మాజీతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. ఆమె వెంట వైసిపి నాయకులు అయ్యల రాంబాబు, వైసిపి పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ఆత్రేయపురం : ర్యాలి గ్రామంలో బుధవారం పలువురు వైసిపిని వీడి మద్దూరి సుబ్బారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ పార్టీలో చేరిన అందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నానని, ఎటువంటి బేధాలు లేకుండా టిడిపి కుటుంబ సభ్యులతోనూ అలాగే జనసేన పార్టీ కుటుంబ సభ్యులతోనూ కలసి మెలిసి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం ఏర్పడటం కోసం, కొత్తపేటలో ఉమ్మడి అభ్యర్థిగా తన గెలుపు కోసం కృషి చేయాలని సత్యానందరావు కోరారు.